

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 521.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి నీటి విడుదలను నిలిపివేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: స్థానిక మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,100 వరకు పలికింది.

కరోనా @ జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కాలేదు. జిల్లాలో ఎక్కడా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

నేటి నుంచి మిర్చి యార్డుకు వేసవి సెలవులు



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మిర్చి యార్డుకు శనివారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించినట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మిర్చి యార్డు దిగుమతి, ఎగుమతి షాపుల కార్మిక సంఘం, దిగుమతి వ్యాపారుల సంఘం సూచనలు, అభ్యర్థనల మేరకు ప్రస్తుత వేసవి సీజనులో ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వేసవి సెలవులు ప్రకటించడం జరిగిందన్నారు. సెలవు రోజుల్లో మిర్చి యార్డులో దిగుమతులు, ఎగుమతులతో పాటు, ఎలాంటి క్రయ విక్రయాలు జరగవన్నారు. రైతులు సహకరించి యార్డుకు తమ మిర్చి బస్తాలను సెలవు రోజుల్లో తీసుకురావద్దని విజ్ఞప్తి చేశారు. జూన్ 12వ తేదీ నుంచి యార్డులో యథావిధిగా క్రయ విక్రయాలు జరుగుతాయని ఆయన తెలియజేశారు.

94,975 బస్తాల మిర్చి విక్రయం

గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 81,402 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 94,975 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నెంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగి, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ. 9,000 నుంచి రూ. 23,500 వరకు పలికింది. తాలు రకం మిర్చికి రూ. 5,500 నుంచి రూ. 13,500 వరకు ధర లభించింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 30, 645 బస్తాలు మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి తెలిపారు.

ఆక్రమణ భూముల క్రమబద్ధీకరణ



జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: అక్టోబర్ 15, 2019 లేదా అంతకంటే ముందే ఆక్రమణలో ఉన్న అభ్యంతరం లేని అనధికారికంగా ఉన్న భూములను క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం ప్రత్యేక జీఓను తీసుకొచ్చిందని శుక్రవారం జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. దీని ప్రకారం 100 చగ వరకు దారిద్ర్య రేఖ దిగువన ఉన్న వారికి డి పట్టా మంజూరు చేస్తారన్నారు. దీనికి 10 ఏళ్ళ తర్వాత తమకిష్టమైన వారికి బదలాయించే వీలుంటుందని తెలిపారు. 101 నుంచి 200 చగ బేసిక్ విలువలో 50 శాతం చెల్లించాలన్నారు. 201 నుంచి 300 చగ బేసిక్ విలువ పూర్తిగా చెల్లించాలని చెప్పారు. 301 నుంచి 500 చగ ఉన్న వారు బేసిక్ విలువలో 150 శాతం చెల్లించాలన్నారు. 100 నుంచి 500 చగ మధ్యలో ఉన్న స్థలాలకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నగదు చెల్లిస్తే కన్వేయన్స్ డీడ్ ద్వారా సదరు వ్యక్తులకు పూర్తి హక్కులు కల్పిస్తారని చెప్పారు. దీనికి విద్యుత్ కనెక్షన్ బిల్లుగాని, ప్లాన్‌గాని, నీటి పన్ను రసీదుగాని సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు తప్పనిసరని తెలిపారు.

తెనాలి నుంచి ఊటీకి ఆర్టీసీ టూరిస్ట్ బస్సు

తెనాలి: ఏపీఎస్ ఆర్టీసీ, తెనాలి డిపో నుంచి ఈనెల 20 తేదీన ఊటీకి సూపర్ లగ్జరీ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజరు ఎ.రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ బస్సు తెనాలి నుంచి బయలుదేరి ప్రయాణీకులకు బెంగళూరు, మైసూర్ ప్యాలెస్, మైసూర్‌లోని ముఖ్యప్రదేశాలతోపాటు మరుసటిరోజు మొత్తం ఊటీలోనే ఉండి ప్రసిద్ధ ప్రదేశాలను తిలకించే అవకాశం కల్పిస్తుందని తెలిపారు. తిరిగి 23వ తేదీ ఉదయం తెనాలికి చేరుకుంటుందని వివరించారు. టికెట్ ఖరీదు రూ.3,380లుగా చెబుతూ ఆసక్తి గల ప్రయాణీకుల వెంటనే బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

డెంగీ నివారణకు కృషి

బాపట్ల కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: డెంగీ జ్వరాలు నివారణకు ప్రతి ఒక్కరం కృషి చేద్దామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. ఈనెల 16వ తేదీన జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్యారోగ్యశాఖ అధికారులు తయారు చేసిన యాక్షన్‌ప్లాన్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా దోమలు పెరిగే ప్రదేశాలను గుర్తించి యాంటీ లార్వా ఆపరేషన్ చేయాలని సూచించారు. ఫ్రైడే..డ్రైడేగా కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయమ్మ, మలేరియా అధికారి వై.రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చిత్రంలో మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్



దుర్గా మల్లేశ్వర స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వేదనాదం.. మహాయాగం

వేడుకగా ప్రారంభమైన శ్రీలక్ష్మీ మహాయజ్ఞం

- యజ్ఞ సంకల్పం తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- కనుల పండువగా సాగిన దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: బెజవాడ వేదఘోషతో మార్మోగింది. ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. సకల జనుల క్షేమాన్ని కాంక్షిస్తూ, రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలన్న సంకల్పంతో చేపట్టిన అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ మహాయజ్ఞం ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యజ్ఞ సంకల్పం తీసుకున్న అనంతరం మహాయజ్ఞం ఆరంభమైంది. ముఖ్యమంత్రి గోశాల వద్ద ప్రత్యేక పూజలు చేసి, కపిల గోవుకు హారతి ఇచ్చారు. అనంతరం అఖండ దీపారాధనలో పాల్గొన్నారు. ఈ యాగం మే 17వ తేదీ బుధవారం వరకు ఆరు రోజులపాటు ఈ యజ్ఞం కొనసాగనుంది. వైఖానసం, పాంచరాత్రం, శైవం, వైదిక స్మార్తం అనే నాలుగు ఆగమాలతో ఏర్పాటు చేసిన నాలుగు ప్రధాన యాగశాలల్లో యజ్ఞాలు జరుగుతున్నాయి. ఒక్కొక్క యాగశాలలో 27 కుండాల చొప్పున మొత్తం 108 కుండాలతో రుత్వికులు యజ్ఞ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 6 గంటల నుంచి 9 గంటల వరకు యజ్ఞ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ యజ్ఞం దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో సాగుతోంది. ప్రభుత్వ అడ్వైజర్ అజేయ కల్లాం, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, మంత్రులు తానేటి వనిత, జోగి రమేష్, ఉషాశ్రీచరణ్, అంబటి రాంబాబు, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, ఎమ్మెల్సీలు పోతుల సునీత, అరుణ్ కుమార్ రుహుల్లా, కల్పలతారెడ్డి, ఎమ్మెల్యేలు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్, ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతం రెడ్డి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



యాగశాల వద్ద పూజలు నిర్వహిస్తున్న పండితులు



నాట్యం చేస్తున్న కళాకారులు

భక్తుల కోసం నాలుగు క్యూలైన్లు..

యజ్ఞ కార్యక్రమాలను భక్తులు వీక్షించేలా ఉమ్మడిగా యాగశాలల చుట్టూ నాలుగు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వాటిలో ఒకదానిని వీవీఐపీల కోసం కేటాయించారు. ఉదయం 9గంటలకు 1008 భక్తులతో విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. కుర్తాళం శ్రీ సిద్ధేశ్వరీ పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, రమ్యానంద భారతీ మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. చండీ, రుద్ర, రాజ శ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహాయజ్ఞం తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు వచ్చారు. సాయంత్రం బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. బేతాళ నృత్యాలు ఆకట్టుకున్నాయి. దుర్గామల్లేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా సాగింది. ప్రజలు భక్తి శ్రద్ధలతో యాగశాలలను సందర్శించి, పూజలు చేశారు. తొలిరోజు విజయవాడ దుర్గగుడి ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర, చక్ర పొంగలి పంపిణీ చేశారు.

సీఎం పర్యటనకు పటిష్ట చర్యలు

ఎస్పీ వకుల్ జిందాల్



నిజాంపట్నంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

నిజాంపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా పటిష్ట భద్రతా చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ వెల్లడించారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా నగదు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈనెల 16న నిజాంపట్నం ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో శుక్రవారం ఎస్పీ నిజాంపట్నంలో పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో బందోబస్తులో ఉన్న పోలీసులతో పాటు ప్రజలకు తాగునీటి ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజలు పార్కింగ్ ప్రాంతాల నుంచి సభా ప్రాంగణానికి వచ్చే ప్రాంతాల్లో ఎటువంటి అసౌర్యం కలుగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తొలుత హెలీప్యాడ్ ఏర్పాటు ప్రాంతం నుంచి సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను పర్యటించి పోలీసు అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఎస్పీ వెంట రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమకుమార్, రేపల్లె రూరల్, టౌన్, వేమూరు సీఐలు శివశంకర్, విజయచంద్ర, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిషేధం నుంచి రైతుల భూములకు శాశ్వత హక్కు

శాసనమండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి



హక్కు పత్రాలను అందిస్తున్న శాసనమండలి చీఫ్‌విప్ డాక్టరు ఉమ్మారెడ్డి, కలెక్టర్ బాషా

బాపట్ల: నిషేధిత భూముల జాబితా నుంచి వందేళ్ల తర్వాత రైతుల భూములకు శాశ్వతంగా విముక్తి కలిగిందని శాసనమండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. చుక్కల భూముల రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం శుక్రవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశంలో జరిగింది. రైతులకు భూ హక్కు పత్రాల పంపిణీ రాష్ట్రవ్యాప్త కార్యక్రమాన్ని కావలి పట్టణంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించగా రైతులు తిలకించేలా అధికారులు ప్రత్యక్ష ప్రసారానికి ఏర్పాట్లు చేశారు. అనంతరం జిల్లాలోని లబ్ధిదారులైన రైతులకు ఏపీ లెజిస్లేటివ్ చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లుతో కలిసి జిల్లా కలెక్టర్ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. రైతుల భూ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి శాశ్వతంగా పరిష్కరించారని శాసనమండలి చీఫ్ విప్ డాక్టరు ఉమ్మారెడ్డి తెలిపారు. రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో సీఎం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గొప్ప నిర్ణయాలు తీసుకున్నారని కితాబిచ్చారు. తరతరాలుగా వందేళ్ల అనుబంధంతో సాగు చేస్తున్న కుటుంబాలకు ఆ భూములపై హక్కు లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల పక్షాన నిలిచిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎలాగైనా మేలు చేయాలని ఆత్మస్థైర్యంతో చట్టాన్ని అమలులోకి తెచ్చారన్నారు. సాగు చేస్తున్న భూములకు శాశ్వత హక్కు కల్పించడం అభినందనీయమన్నారు. ఇలాంటి గొప్ప నిర్ణయాలు తీసుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రికి రైతులంతా రుణపడి ఉన్నారని చెప్పారు.

వందేళ్ల సమస్యకు పరిష్కారం: కలెక్టర్

చుక్కల భూముల జాబితాలో వందేళ్లుగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించిందని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. జిల్లాలో 3,514 సర్వే నెంబర్లలోని 7,833.87 ఎకరాల భూమిని నిషేధిత జాబితా నుంచి శాశ్వతంగా విముక్తి కల్పించామన్నారు. బాపట్లలో 4,257 రైతు కుటుంబాలు లబ్ధి పొందుతాయన్నారు. బ్రిటిష్ కాలం నుంచి చుక్కల భూమి ఎవరిదో స్పష్టత లేదన్నారు. ప్రభుత్వానికి చెందినవా.. ప్రైవేట్ వ్యక్తుల భూములా అనే విషయంలో సందిగ్ధత నెలకొందన్నారు. రైతుల సమస్యలను గుర్తించిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చట్టాన్ని తెచ్చారన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాలతో రైతుల సమస్యలన్నీ ఇక శాశ్వతంగా పరిష్కారమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిని కె.లక్ష్మీ శివజ్యోతి, కలెక్టరేట్ ఏవో సుశీల, రైతులు పాల్గొన్నారు.

నిషేధం వేళ.. కొండంత భరోసా

వైఎస్సార్ మత్స్యకార భరోసా పంపిణీకి ఏర్పాట్లు

- 16న సీఎం చేతుల మీదుగా అందజేత
- 12,060 కుటుంబాలకు భరోసా
- అత్యధికంగా నిజాంపట్నంలో 5065 మంది లబ్ధిదారులు
- ప్రభుత్వ సాయంపై మత్స్యకారుల హర్షం



సాక్షి ప్రతినిధి, బాపట్ల: సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలను ఆదుకుంటున్న వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం మత్స్యకారులను అన్నివిధాల ఆదుకుంటోంది. వేట నిషేధ సమయంలో వారికి ప్రత్యేక భృతిని అందజేసి అండగా నిలుస్తోంది. ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు రెండు నెలల పాటు చేపలవేట నిషేధించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో మత్స్యకారులకు వేట ఉండదు. దాని వలన జీవనభృతికి ఇబ్బందులు తప్పని పరిస్థితి. ఈ సమయంలో మత్స్యకారులకు సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో కుటుంబానికి రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయాన్ని అందించింది. గత ప్రభుత్వ హయాంలో నామమాత్రంగా ఉన్న సహాయభృతిని వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత మరింతగా పెంచారు. పెంచిన మొత్తాన్ని ప్రతి ఏటా క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత ప్రభుత్వం నాలుగోసారి మత్స్యకార భరోసాను అందిస్తోంది. దీంతో గంగపుత్రుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

జిల్లాలో 12060 మందికి..

జిల్లాలో పెద్ద మొత్తంలో మత్స్యకారులకు ప్రభుత్వం భరోసా కింద నిధులు అందజేస్తోంది. బాపట్ల మండలంలో 1369, రేపల్లె మండలంలో 1824, చినగంజాం 983, వేటపాలెం 925, చీరాల 1894, నిజాంపట్నం 5065 మంది చొప్పున మొత్తం 12060 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. నిజాంపట్నంలో అత్యధికంగా లబ్ధిదారులు ఉండటం గమనార్హం. వీరందరికీ ఈనెల 16న రేపల్లె నియోజకవర్గంలోని నిజాంపట్నం మండలంలో జరిగే సభలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా మత్స్యకార భరోసా అందజేయనున్నారు.

జగనన్న హయాంలో పెరిగిన సాయం

జిల్లాలో రేపల్లె, బాపట్ల, చీరాల నియోజకవర్గాల పరిధిలో తీరప్రాంతం ఉంది. వేలాదిమంది మత్స్యకార కుటుంబాలు చేపల వేటే ప్రధాన జీవనం. ప్రతి ఏడాది వేట నిషేధ సమయంలో గతంలో రూ. 2 వేలు నగదు, బియ్యం, ఇతర నిత్యావసరాలు ఇచ్చేవాళ్లు. ఆ తర్వాత నిత్యావసరాలను నిలిపివేసి రూ. 4 వేల నగదును భృతిగా అందించారు. అది కూడా గత ప్రభుత్వ హయాంలో ఏడాదిలో రెండు పర్యాయాలు అందించే వారు. అర్హులందరికీ భృతి అందించే వారు కాదు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ భృతిని రూ. 4 వేల నుంచి రూ. 10 వేలకు పెంచారు. మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లతోపాటు సాంప్రదాయ నావలపై ఆధారపడి జీవించే వారికి కూడా భరోసా అందజేస్తున్నారు. ఇస్తున్న భరోసాను ఆలస్యంగా కాకుండా నిషేధకాలం ముగిసే నాటికే ప్రభుత్వం భృతిని అందజేస్తోంది.

లబ్ధిదారుల ఎంపిక పారదర్శకం

మత్స్యకార భరోసాకు ఎంపిక చేస్తున్న లబ్ధిదారులను ప్రభుత్వం మరింత పారదర్శకంగా ఎంపిక చేస్తోంది. వేట నిషేధం అమలులోకి వచ్చిన మరుక్షణమే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. ఆర్‌బీకేలో పనిచేసే మత్స్య సహాయకులు, వలంటీర్, సాగరమిత్రలతో కూడిన బృందాలు లబ్ధిదారులను గుర్తించారు. ఆరుదశల వెరిఫికేషన్ అనంతరం తుది జాబితాను రూపొందించారు.

సకాలంలో అందిస్తున్నారు



సముద్రపు వేట నిషేధ సమయంలో పనుల్లేక ఇల్లు గడవటమే కష్టంగా ఉంటుంది.ప్రభుత్వం అందించే సొమ్ము ఎప్పటికో వచ్చేవి. అటువంటి పరిస్థితులను తిరగరాస్తూ జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత ప్రభుత్వం అందించే సొమ్ము రూ.4 వేల నుంచి ఒక్కసారిగా రూ.10 వేలు చేసి సకాలం అందించే పరిస్థితికి తెచ్చారు. సీఎం జగన్ రుణం తీర్చుకోలేనిది.

–మోకా నాగరాజు,
మత్స్యకారుడు, పల్లెపాలెం, అడవులదీవి, నిజాంపట్నం మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



గతంలో మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో అందించే అరకొర భృతి సైతం ఎప్పటికో వచ్చేది. వేట నిషేధ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. అయితే జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత రూ.4 వేల నుంచి రూ.10 వేలకు ఒక్కసారిగా పెంచి భృతి అందిస్తున్నారు. ఆయనకు మేమంతా రుణపడి ఉంటాం. సీఎం వై.ఎస్.జగన్ మాపై చూపుతున్న ప్రేమను మరువలేం.

–కొక్కిలిగడ్డ రత్తయ్య,
మత్స్యకారుడు, పల్లెపాలెం, అడవులదీవి, నిజాంపట్నం మండలం

విద్యాకానుక తనిఖీ చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ

జెడ్పీ పాఠశాలలో వసతులపైనా ఆరా



బూట్లు పరిశీలిస్తున్న ప్రవీణ్ ప్రకాష్

జె.పంగులూరు: మండల పరిధిలోని పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుకను శుక్రవారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న జగనన్న విద్యా కానుక కింద ప్రస్తుతం మండలం మొత్తం మీద 3926 జతల బూట్లు, 7856 జతల సాక్స్‌లు వచ్చాయి. వాటిని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ క్షుణంగా పరిశీలించారు. వాటిలో 9వ నెంబర్ గల బుట్లను గురించి ఆరా తీశారు. వాటిలో 9వ నెంబర్ బూట్లు రాలేదని తెలిపారు. 9వ బూట్ సైజ్ గల పిల్లలకు ఎలా ఇస్తారు అని అధికారులను ప్రశ్నించారు. స్టాక్ వచ్చినప్పుడు ప్రతి ఒక్క సైజు చెక్ చేసుకోవాలి కదా అని ప్రశ్నించారు. అధికారులతో కొంత సమయం మాట్లాడారు. జగనన్న విద్యాకానుకను ప్రతి ఒక్క విద్యార్థికి మిస్ అవ్వకుండా చూసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డీఈవో రామారావు, ఆర్‌జేడీ సుబ్బారావు, సీఎంఓ రజినీ, ఎంఈవో నాగభూషణం, హెచ్‌ఎం రమాదేవి, ఏపీఎం జ్యోతిప్రసాద్ బాబు తదితరులు ఉన్నారు.

గంటల వ్యవధిలోనే...

పోలీసుల అదుపులో అత్యాచార నిందితుడు

కొల్లూరు: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని గంటల వ్యవధిలోనే పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. గురువారం రాత్రి మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తెనాలి నుంచి ఆటోలో వస్తుండగా మండల పరిధిలోని మొసలిపాడు వద్ద ఆటో డ్రైవర్ ఆటోతో సహా పంటపొలాల్లోకి తీసుకువెళ్లి దాడికి పాల్పడి పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన సంఘటన విదితమే.. బాధిత మహిళ ఫిర్యాదు సేకరించిన కొల్లూరు పోలీసులు ఆటో తాళం కీచైన్ పై ఉన్న నిందితుడి ఫోటో, ఆటో అడ్రస్ ఆధారంగా తెనాలికి చెందిన మొగిలి గోపికృష్ణ (వాసు)గా గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఎస్ఐ రాజీవ్ శామ్యూల్ కుమార్ తెనాలిలోని వేగుల ద్వారా నిందితుడి వివరాలు సేకరించి గురువారం అర్ధరాత్రి హుటాహుటిన అక్కడకు వెళ్లారు. తెనాలి బుర్రిపాలెం రోడ్డులోని పాలాద్రి కాలువ వెంబడి ఉన్న గురవయ్య కాలనీ సమీపంలో నిందితుడి నివాసంగా గుర్తించిన పోలీసులు అతని కదలికలపై నిఘా ఉంచారు. చంద్రబాబు కాలనీలోని బంధువుల ఇంటికి గోపికృష్ణ చేరుకున్నట్లు గుర్తించి సంఘటన జరిగిన రెండు గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకుని కొల్లూరుకు తరలించారు. బాధిత మహిళను రక్షించేందుకు వెళ్లిన యువకులను చూసి నిందితుడు పరారై చివరకు లారీ ఎక్కి తెనాలి చేరుకున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. చుండూరు సీఐ ఎ. రాజమోహన్ నేతృత్వంలో బాధితురాలిని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అత్యాచార ఘటనపై బాధితురాలితోపాటు, నిందితుడిని, మహిళను కాపాడేందుకు వెళ్లిన యువకులను వేమూరు సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టడంతోపాటు, వారి వాంగ్మూలాలు సేకరించే ప్రక్రియ చేపట్టారు. అత్యాచార సంఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

అద్దె భారం.. ఇక దూరం



- ప్రభుత్వ ఉద్యోగులకు 16శాతానికి హెచ్ ఆర్ ఏ పెంపు
- కొత్త జిల్లా కేంద్రాల్లో వారికి వర్తింపుతో ఉద్యోగులకు మేలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

బాపట్ల: ప్రజలకు వద్దకు సేవలను వేగవంతంగా తీసుకెళ్లేందుకుగాను, అభివృద్ధి పథంలో రాష్ట్ర ప్రగతి ముందుకు సాగేందుకుగాను ఆంధ్రప్రదేశ్‌లో 13 జిల్లాలను ప్రభుత్వం విభజించింది. తద్వారా 25 జిల్లాలుగా రూపాంతరం చెందగా.. ఆయా జిల్లా కేంద్రాలకు ప్రభుత్వ యంత్రాగాన్ని సమకూర్చింది. నిత్యం ఉద్యోగుల సంక్షేమాన్ని కాంక్షించే ప్రభుత్వం.. తాజాగా జిల్లా కేంద్రాల్లో నివసించే ప్రభుత్వ ఉద్యోగులకు హెచ్ ఆర్ ఏ నాలుగు శాతం పెంచి బాపట్ల జిల్లా కేంద్రం పరిధిలో ఉన్న 12 వేల మందికిపైగా ఉద్యోగులకు నెలకు రూ.2 కోట్ల మేరకు అదనంగా హెచ్‌ఆర్‌ఏ ఇచ్చేందుకు ముందుకొచ్చింది. వారి ఇంటి అద్దె భారాన్ని దూరం చేసింది. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డికి ప్రభుత్వం ఉద్యోగుల పట్ల వ్యవహరిస్తున్న సానుకూల ధోరణికి వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బాపట్ల జిల్లాలో ఉద్యోగులకు లబ్ధి ఇలా...

బాపట్ల కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేసి గతనెలకు ఏడాది పూర్తయింది. జిల్లా కేంద్రంలో ఇప్పటి వరకు 12 శాతం హెచ్‌ఆర్‌ఏ ఉండగా తాజా ప్రభుత్వం జిల్లా కేంద్రం పరిధిలో ఉన్న ఉద్యోగులకు 16 శాతం హెచ్‌ఆర్‌ఏ పెంపుదల చేపట్టారు. రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు వారి బేసిక్‌ను ఆధారం చేసుకుని రూ.1500 నుంచి రూ.5 వేలు వరకు పెరిగే అవకాశం ఉంది. ఈలెక్కన చూస్తే బాపట్ల జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఉద్యోగులతోపాటు అన్నిశాఖల ఉద్యోగులు, సచివాలయం, మున్సిపాల్టీ, పోలీసు, ఆటవీ, ఎక్సైజ్ వివిధ శాఖలకు సంబంధించి మొత్తం 12 వేల మందికిపైకిపైగా లబ్ధిచేరుకుంది. సరాసరిగా చూస్తే నెలకు రూ.2 కోట్ల మేరకు హెచ్‌ఆర్‌ఏ పెంపుతో ఉద్యోగులకు మేలు చేకూరుతుంది.

ఉద్యోగులకు ఎంతో మేలు



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హెచ్‌ఆర్‌ఏ పెంపుదలతో ఎంతో మేలు జరుగుతుంది. కొత్త జిల్లాలో అద్దెలు విపరీతంగా పెరిగిపోవటంతో ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చూపిన చొరవ ఉద్యోగులు ఎప్పటికి మరిచిపోలేరు. ఈపెంపుదల ఎంతో మేలు జరిగే విధంగా ఉంది.

– పి.నాగేశ్వరరావు, ఎన్జీవోలఅసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

అడగకుండానే హెచ్‌ఆర్‌ఏ పెంపుదల



జిల్లా కేంద్రంలో పనిచేసే ఉద్యోగులకు 12 శాతం నుంచి 16 శాతం హెచ్ ఆర్‌ఏ పెంపుదల చేస్తూ నిర్ణయం తీసుకోవటం హర్షణీయం. ఉద్యోగసంఘాలు కోరకుండానే నేరుగా పెంపుదల చేయటం ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు. అద్దె పెంపుదల మాకు అందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఓంకార్, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా కోశాధికారి

మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి రూ.లక్ష విరాళం

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి శుక్రవారం లక్షా వెయ్యి నూట పదహారు రూపాయలను తెనాలికి చెందిన ప్రసాద్ ల్యాబ్స్ అధినేత జీవీఎస్‌ఆర్‌కే ప్రసాద్ విరాళంగా అందించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకటరెడ్డి, ఫౌండర్ ట్రస్టీ మెంబర్లు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని మనస్థాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తూర్పుమాలపల్లెకు చెందిన కట్టా మస్తాన్(49) పెయింటర్‌గా పనిచేస్తుంటాడు. కొంతకాలంగా మద్యానికి బానిసైన మస్తాన్ ఈ నెల 8వ తేదీ భార్యను మద్యానికి డబ్బులు అడిగాడు. ఆమె నిరాకరించటంతో మనస్థాపానికి గురై ఇంట్లో గడ్డి మందు సేవించాడు. బంధువులు పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కాలువలో గుర్తుతెలియని మహిళ మృతదేహం

చీరాల: పట్టణంలోని బద్దల కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించారు. కాలువలో మహిళ మృతదేహం తేలడంతో స్థానికులు ఒన్ టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని బయటకు తీయగా గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. మహిళ వయస్సు 50–60 సంవత్సరాల మధ్య ఉంటుందని ఒన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. మహిళది హత్యా లేదా ఆత్మహత్య, ప్రమాదం వలన జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఆటో బోల్తా కొట్టి ఏడుగురికి గాయాలు

సత్తెనపల్లి: ఆటో బోల్తా కొట్టి ఏడుగురికి గాయాలైన సంఘటన అబ్బూరు రోడ్‌లో శుక్రవారం జరిగింది. సత్తెనపల్లి నుంచి కూలీలతో వెళుతున్న ఆటో అబ్బూరు రోడ్‌లో జగనన్న కాలనీ దాటిన తర్వాత గేదెను తప్పించే క్రమంలో ఆటో బోల్తా కొట్టింది. ఆటోలో ఉన్న వెంకటమ్మ, కె.సత్యవతి, కె.భాగ్యంలకు తీవ్ర గాయాలు కాగా ఆర్‌వీ లక్ష్మమ్మ, కె.సునందదేవి, నవ్య, మరో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను సత్తెనపల్లి తరలించారు.

రహదారులను ఆగం చేస్తే జరిమానా



గ్రామంలో ఉపాధి హామీ పనులు చేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

- పంచాయతీ అధికారులకు కలెక్టర్ ఆదేశం
- ఇర్లపాడు గ్రామంలో నవోదయ కార్యక్రమం

నాదెండ్ల: రోడ్లపై చెత్త వేసి అపరిశుభ్రపరిస్తే పంచాయతీ అధికారులకు అపరాధ రుసుం వేసే అధికారం ఉందని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ చెప్పారు. నాదెండ్ల మండలం ఇర్లపాడు గ్రామాన్ని శుక్రవారం ఆయన నవోదయం కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ఉదయం 7గంటలకు గ్రామానికి వచ్చిన ఆయన 11 గంటల వరకు గ్రామంలోనే గడిపారు. ముందుగా గ్రామంలో పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. సైడు కాల్వల నిర్వహణ ఎలా ఉండాలో అధికారులకు సూచనలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి గర్భిణులకు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహార విషయాలను తెలుసుకున్నారు. గర్భిణులు, చిన్నారుల్లో రక్తహీనత వివరాలు అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఈ గ్రామానికి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్న విషయాన్ని సర్పంచ్ మంగు రమాదేవి వివరించారు. గ్రామంలో తాగునీరు, వీధిలైట్ల నిర్వహణ, వ్యవసాయ సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

గ్రామీణ ఉపాధి పనుల్లో పాల్గొన్న కలెక్టర్

250 మంది కూలీలతో గ్రామంలో జరుగుతున్న గ్రామీణ ఉపాధి హామీ పనులను స్వయంగా పరిశీలించారు. పంట కాల్వల పూడికతీత పనులను పరిశీలించి కూలీలకు అందతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. స్వయంగా ఆయనే పలుగు తీసుకొని కొద్దిసేపు పనుల్లో నిమగ్నమయ్యారు. ఆయనతోపాటు సర్పంచ్ రమాదేవి, నాదెండ్ల సొసైటీ చైర్మన్ మంగు ఏడుకొండలు, పీఎంసీ చైర్మన్లు ఒంగూరి కృష్ణమనాయుడు, యడ్ల మరియదాసు, స్థానిక అధికారులు, తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్ హుస్సేన్, ఎంఈవో ఆంజనేయులు, ఏపీఎం భరత్, ఏపీవో పుష్పరాజ్, సీడీపీవో శాంతకుమారి, ఏవో ఎ హరిప్రసాద్, ఆర్ డబ్ల్యుఎస్ ఏఈ సూర్యతేజ, పంచాయతీ కార్యదర్శి మాధవి పాల్గొన్నారు.

ఆహ్లాదకరంగా రక్షణ నిలయాలు

- మారుతున్న పోలీస్‌స్టేషన్ల రూపురేఖలు
- ఎస్పీ ఆదేశాలతో సుందరంగా తీర్చిదిద్దుతున్న సిబ్బంది
- సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సంస్థలు



నూతన హంగులతో దర్శనమిస్తున్న నరసరావుపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్



టూటౌన్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పూల మొక్కలు

నరసరావుపేటటౌన్: ఎన్నో గొడవలు.. మరెన్నో వివాదాలు.. ఇంకెన్నో సమస్యలతో పోలీసుస్టేషన్ ప్రాంగణంలో అడుగుపెట్టిన వారికి ఆహ్లాదకరమైన వాతావరణం అక్కున చేర్చుకుంటుంది. మర్యాదపూర్వకమైన మాటలతో వారి బాధలను అక్కడ అధికారులు తగ్గిస్తుంటే.. మరోవైపు చూడముచ్చటగొలిపే పచ్చదనం వారి సమస్యలకు పరిష్కారం దొరికినట్లేలా గోచరిస్తుంది. ఇదీ పల్నాడు జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న వాతావరణం.

శ్రీకారం చుట్టిన ఎస్పీ

పల్నాడు జిల్లాలోని పిడుగురాళ్ల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్లలోని రికార్డుల్లో సమస్యలకంటే.. స్టేషన్ పరిసరాలు ఎస్పీని ఇబ్బంది పెట్టాయి. స్టేషన్‌లోకి అడుగు పెట్టగానే.. గుమ్మంలోనే చెత్త స్వాగతం పలికింది. ఎస్పీ పోలీసు అధికారులపై మండిపడ్డారు. స్టేషన్లో రికార్డులకంటే తొలుత పరిసరాలు దుమ్ము వదిలించాలని ఆదేశించారు. ఈ స్టేషన్ చూశాక ఎస్పీ జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్‌స్టేషన్ల రూపురేఖలు మార్చేయాలని కంకణం కట్టుకున్నారు.

స్వచ్ఛంద సంస్థల సహకారంతో..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 33 పోలీస్‌స్టేషన్లను సుందరంగా మార్చేందుకు స్వచ్ఛంద సంస్థల సహకారంతో పోలీసు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టారు. దీనికిగాను స్టేషన్లో ఉన్న సిబ్బంది కూడా తమ వంతు సహకారం అందించారు. పోలీసుస్టేషన్ల రూపురేఖలు మారిపోతున్నాయి. నరసరావుపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ భవనానికి నూతన రంగులు ఏర్పాటు చేశారు. స్టేషన్ పరిసరాలను శుభ్రపరిచి ప్రాంగణమంతా పచ్చదనంతో నింపారు. ఇదే తరహాలో మరమ్మతులకు గురైన భవనాలు చక్కబడుతున్నాయి. అవి పెయింటింగ్‌లు అద్దుకుని సుందరంగా మెరిసిపోతున్నాయి. మరో వైపు పరిసరాల్లో అపరిశుభ్రతకు దూరమై.. ఆ స్థానంలో మొక్కలు వచ్చి చేరుతున్నాయి. దీంతో స్టేషన్ వచ్చే ప్రజలను పచ్చదనం ఆహ్వానిస్తోంది. ఇలా జిల్లా ప్రధాన కేంద్రమైన నరసరావుపేటతో పాటు అన్ని పోలీస్ స్టేషన్లు ఆహ్లాద వాతావరణాన్ని సంతరించుకుంటున్నాయి.

పోలీస్‌స్టేషన్లే దేవాలయాలు



ప్రతి ఉద్యోగికీ వారు పనిచేసే కార్యాలయం దేవాలయంతో సమానం. అందుకే ఆ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఉద్యోగులు ఇంట్లో కంటే కార్యాలయంలోనే ఎక్కువ సమయం వెచ్చిస్తుంటారు. అలాంటి వారు కార్యాలయాలను దేవాలయాలుగా చూసుకోవాలి. ఈ క్రమంలో తమ సిబ్బంది ఎంతో హుందాగా ముందుకు వచ్చి తమ కార్యాలయాల రూపురేఖలు మారుస్తున్నారు.

– వై.రవిశంకర్‌రెడ్డి, పల్నాడు జిల్లా ఎస్పీ

మనసును కదిలించిన నాటికలు



"లక్ష్మణరేఖ దాటితే..." నాటికలోని ఓ సన్నివేశం

చీరాల అర్బన్: స్థానిక మున్సిపల్ గరల్స్ హైస్కూల్ ఆవరణలో చీరాల కళాంజలి ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం రాత్రి మిత్ర క్రియేషన్స్, హైదరాబాద్, నరసరావుపేట వారి ఆధ్వర్యంలో ''లక్ష్మణ రేఖ దాటితే...'' నాటికను ప్రదర్శించారు. పందు క్రియేషన్స్, కొప్పోలు వారి ఆధ్వర్యంలో ''పక్కింటి మొగుడు'' అనే నాటికను ప్రదర్శించారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కళాంజలి అధ్యక్ష, కార్యదర్శులు కోడూరి ఏకాంబరేశ్వర బాబు, తిరుమలశెట్టి సాంబశివరావు, వలివేటి మురళీకృష్ణ, బీరం సుందరరావు, బత్తుల బ్రహ్మారెడ్డి, కోశాధికారి దరియా సాహెబ్, పూర్ణా సత్యం, వడలి రాధాకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి అరటిపండ్ల పూజ



బంగారు తమలపాకులను ఆలయ ఏసీ సుభద్రకు అందజేస్తున్న దాతలు




అరటి పండ్ల పూజలో ప్రసన్నాంజనేయ స్వామి

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామికి హనుమజ్జయతి సందర్భంగా శుక్రవారం అరటిపండ్ల పూజ నిర్వహించారు. ఉదయం స్వామివారిని అభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు స్వామివారి 11 ఆవృత్తాలుగా అరటి పండ్ల పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న దాతలు, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బంగారు తమలపాకుల దండ బహూకరణ..

మండలంలోని మైలవరం గ్రామానికి చెందిన నరిశెట్టి చంద్రశేఖర్, విద్యాపవన్, మన్నేపల్లి విద్యాదిత్య నాగపుష్ప, మన్నేపల్లి ప్రసాద్ పుష్పాంజలి, మన్నేపల్లి ప్రవీణ్ మేఘన, యాగంటి అశోక్ గాయత్రి, మన్నేపల్లి కార్తీక్ లావణ్య దంపతులు రూ.24 లక్షలు విలువ చేసే బంగారు తమలపాకులను కార్యనిర్వహణాధికారి సుభద్రకు అందజేశారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణం, మండలంలోని విత్తన దుకాణాల్లో పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయ టాస్క్‌ఫోర్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో విత్తనాల స్టాక్‌ను రిజిస్టర్లో ఎంట్రీ చేయని కారణంగా రూ.2.30లక్షల విలువైన విత్తనాల అమ్మకాలను నిలిపివేయడం జరిగిందని, రైతులకు ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు అమ్మినట్లయితే లైసెన్స్‌లు రద్దు చేస్తామని అధికారులు తెలిపారు. అధిక ధరలకు విత్తనాలను విక్రయించినట్లు రైతులు ఫిర్యాదు చేసినట్లయితే దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి రైతు విత్తనం కొనుగోలు చేసిన తరువాత రసీదు పొందాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయ ఏడీఏలు సీహెచ్.రవికుమార్, సుజాత, ఏవోలు అరుణకుమారి, వెంకట్రావు, వినుకొండ ఏవో కె.అంజిరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

రహదారిపై సర్వీస్ రోడ్ గ్రిల్స్‌ను ఢీకొన్న వాహనం



వాహనం లోపలికి దూసుకువచ్చిన గ్రిల్స్

అద్దంకి రూరల్: డ్రైవర్ నిద్రమత్తు కారణంగా వాహనం రోడ్డు మధ్యన ఉన్న గ్రిల్స్‌ను ఢీకొట్టటంతో బాలుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. ముండ్లమూరు మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన పూనూరి మెస్సేక్ అదే గ్రామంలో 9వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు వేసవి సెలవులు ఇవ్వటంతో అద్దంకి పట్టణంలోని ఈవెంట్స్‌కు ఆర్కెస్ట్రా నిర్వహిస్తున్న వ్యక్తి వద్దకు పనికి వస్తున్నాడు. మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గురువారం రాత్రి జరుగుతున్న క్రైస్తవ సభలకు ఆర్కెస్ట్రా కార్యక్రమం పూర్తి చేసుకుని అర్ధరాత్రి అద్దంకి వస్తున్నాడు. ఆర్కెస్ట్రా నిర్వాహకుడు వాహనం నడుపుతున్నాడు. పక్కన పునూరి మెస్సేక్ (16) కూర్చుని నిద్రపోతున్నాడు. ఈక్రమంలో పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ వద్దకు రాగానే రహదారి మధ్యన ఉన్న గ్రిల్స్‌ను వాహనం ఢీ కొట్టింది. గ్రిల్స్‌కు ఉన్న ఇనుపరాడ్ నిద్రపోతున్న మెస్సేక్ గొంతులోకి దిగింది. అతను అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై సమందర్‌వలి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి తండ్రి వెంగయ్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

జగనన్నకు చెబుదాంపై ప్రత్యేక శ్రద్ధ

కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. అధికారులు 1902కు వచ్చిన ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా పరిశీలించి 24 గంటల్లోనే పరిష్కరించాలన్నారు. పరిష్కారం కాని సమస్యలు అందితే దానికి గల కారణాలు క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను ఎండార్స్‌మెంట్‌లో రాసి ఫిర్యాదుదారునికి పంపించాలని సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల నుంచి కలెక్టరేట్ వరకు అధికారులు, సిబ్బంది జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా భావించాలని కలెక్టర్ వివరించారు.

గరుడ వాహనంపై గ్రామోత్సవం



గరుడ వాహనంపై అమ్మవార్లతో శ్రీవారు

తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజైన శుక్రవారం శ్రీస్వామి, అమ్మవార్లను గరుడ వాహనంపై ఆసీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటల నుంచి మేళతాళాలు, ప్రత్యేక పూల అలంకరణలతో విద్యుత్‌కాంతుల నడుమ శ్రీవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు పర్యవేక్షించారు. అంతకుముందు గురువారం రాత్రి స్వామి కల్యాణోత్సవం నిర్వహించారు. ముందుగా ఎదురుకోలు ఉత్సవం, అనంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. వేడుకలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్–పుష్ప దంపతులు శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి పట్టువస్త్రాలను సమర్పించి, కల్యాణోత్సవాన్ని తిలకించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ వుప్పల వరదరాజులు పాల్గొన్నారు.